ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★ మంగళవారం 26 ఆగస్టు 2025

మంత్రిని కలిసిన నీటిపారుదల శాఖ రామగుండం సర్కిల్ ఎస్ఈ



పెద్దపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నీటి పారుదల శాఖ రామగుండం (కాళేశ్వరం) సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎండి దస్తగిరి సోమవారం హైదరాబాద్‌లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కలిశారు. తెలంగాణ మైనార్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ రియాజ్ అలీ ఉన్నారు.

పోస్ట్‌మాస్టర్లకు బయోమెట్రిక్ యంత్రాలు పంపిణీ

పెద్దపల్లి ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): చేయూత పింఛన్ డబ్బులను పంపిణీ చేసేందుకు కలెక్టర్ కోయ శ్రీహర్ష పోస్ట్ మాస్టర్లకు బయోమెట్రిక్ యంత్రాలను పంపిణీ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో పోస్ట్ ఆఫీస్ బ్రాంచ్ మేనేజర్లకు ఎఫ్ఆర్ఎస్ మొబైల్స్, బయోమెట్రిక్ యంత్రాలను అందజేశారు. చేయూత లబ్ధిదారులకు నేరుగా ముఖ గుర్తింపు పద్ధతి ఆధారంగా పోస్టల్ పెన్షన్లు పంపిణీకి 22 మంది పోస్ట్ ఆఫీస్ బ్రాంచ్ మేనేజర్లను ఎంపిక చేశారన్నారు. మంథని, జూలపల్లి, రామగిరి, సుల్తానాబాద్ మండలాల్లోని 44 గ్రామాలలో 6,921 మందికి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. డీఆర్‌డీఓ కాళిందిని, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్ పాల్గొన్నారు.

బిల్లుల కోసం తంటాలు

- మన ఊరు.. మన బడి బిల్లుల కోసం ప్రదక్షిణలు
- ఏడాది కాలంగా పెండింగులో రూ. 6 కోట్ల బిల్లులు
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న బాధితులు



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

'మన ఊరు. మన బడి'లో భాగంగా పాఠశాలల అభివృద్ధికి చేపట్టిన పనుల బిల్లులు మంజూరు కావడం లేదు. దీంతో పనులు చేసిన వాళ్ల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఏడాది కాలంగా బిల్లులను ప్రభుత్వం విడుదల చేయక పోవడంతో సదరు వ్యక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధిక వడ్డీలకు అప్పులు చేసి స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల బాధ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు పనులు చేశారు. ఎంబీ రికార్డులు పూర్తయినా కూడా ప్రభుత్వం బిల్లులను విడుదల చేయకపోవడంతో తాము బతికేది ఎలా అని ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో సుమారు 6 కోట్ల రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉండడం గమనార్హం.

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మార్చాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం మన ఊరు మన బడి కార్యక్రమానికి 2021-22లో శ్రీకారం చుట్టింది. మూడేళ్లలో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని నిర్ణయించారు. ఇందుకోసం అప్పటి సీఎం కేసీఆర్ పలువురు మంత్రులతో కలిసి సబ్ కమిటీని వేశారు. ఈ కమిటీ 2021 మార్చి 23, ఏప్రిల్ 8, జూన్ 17న సమావేశమై నివేదికను రూపొందించి ప్రభుత్వానికి అందజేసింది. 2022 జనవరి 17న సమావేశమైన మంత్రి వర్గం రాష్ట్రంలోని పాఠశాలలను రూ.7289 కోట్లతో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. మొదటి దశలో 9,149 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందుకోసం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు యేటా కేటాయించే సీడీఎఫ్ నిధుల నుంచి 40 శాతం నిధులను, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నుంచి కొన్ని నిధులను, మండల, జిల్లా పరిషత్‌లకు విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులను సమకూర్చారు. జిల్లాలో 360 ప్రాథమిక, 83 ప్రాథమికోన్నత, 105 ఉన్నత పాఠశాలలు మొత్తం 548

(మిగతా 8వ పేజీలో)

మారిన రూపు రేఖలు..

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను మన ఊరు మన బడి కార్యక్రమంలో అభివృద్ధి చేయడంతో వాటి రూపురేఖలు మారాయి. శిథిలావస్థలో ఉన్న తరగతి గదుల స్థానంలో కొత్త గదుల నిర్మాణం, మరమ్మతు పనులు, ప్రహరీలు, మరుగుదొడ్ల నిర్మాణం, ఉన్న వాటికి నీటి సౌకర్యం కల్పించడం, తాగునీటి సౌకర్యం కల్పించడం, కిచెన్ షెడ్లు, ఫర్నీచర్, విద్యుద్దీకరణ, పాఠశాలకు తెలుపు, నీలం రంగులు వేయడం, డైనింగ్ హాళ్ల నిర్మాణాలు, డిజిటల్ తరగతుల విద్యాబోధనకు కావాల్సిన సౌకర్యాలు, గ్రీన్ చాక్ బోర్డుల ఏర్పాటు పనులు పూర్తి చేశారు. ఈ పనులన్నింటినీ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ గానీ, వాళ్లు నిర్ణయించిన వారికి పనులను అప్పగించారు. జిల్లాలో ఎక్కువగా మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ఉప సర్పంచులు పనులు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నంత వరకు బిల్లుల చెల్లింపు బాగానే జరిగాయి. నిధుల కొరత వల్ల అప్పటి ప్రభుత్వం రెండో విడత కింద కొత్త పాఠశాలలను ఎంపిక చేయలేదు. 2023 చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అప్పటి వరకు ఉన్న నిధులను వెచ్చించారు. కానీ పెండింగు బిల్లులను చెల్లించలేదు.

పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజిద్దాం



పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకుల పోస్టర్ల ఆవిష్కరణలో కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజించాలనే పోస్టర్లను ఆయన అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి అనుకూలమైన మట్టి విగ్రహాలను ఏర్పాటు చేయాలని, పలు కూడళ్లు, బస్టాండ్, జనసంచారం ఉన్న ప్రదేశాలల్లో వాల్ పోస్టర్లను ప్రదర్శించాలని అధికారులకు సూచించారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి గణపతులను పంపిణీ చేస్తూ పర్యావరణంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పీవోపీతో తయారు చేసిన గణపతుల వల్ల నీటి, వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందన్నారు. నీటిలో జీవించే ప్రాణుల ఉనికికి ప్రమాదం ఏర్పడుతుందని తెలిపారు. మట్టి వినాయకులను పూజించడం వల్ల పర్యావరణ పరిరక్షణతోపాటు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవచ్చని వివరించారు. కలెక్టర్ ప్రజలకు ముందస్తు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. బీసీ సంక్షేమ అధికారి రంగారెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ బిక్షపతి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ బండి ప్రకాష్ పాల్గొన్నారు.

పార్టీలో గ్రూపులకు తావులేదు



కాంగ్రెస్ పార్టీలో చేరిన అజయ్‌కు పార్టీ కండువా కప్పి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

సుల్తానాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పార్టీలో గ్రూపులకు తావు లేదని, అంతా కాంగ్రెస్ కుటుంబమేనని, కలసికట్టుగా ఉంటూ స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొందామని ఎమ్మెల్యే విజయరమణారావు, ఎమ్మెల్సీ భానుప్రసాదరావులు అన్నారు. పట్టణంలోని నీరుకుల్ల రోడ్డులో సోమవారం నిర్వహించిన సభలో నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన కార్యకర్తలు, నాయకులు పార్టీలో చేరారు. గర్రెపల్లి మాజీ సర్పంచ్, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు పడాల అజయ్ గౌడ్, వీరగోని రమేష్‌తోపాటు నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతు ఏడాదిన్నరలో ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందని, అకారణంగా బీఆర్ఎస్, బీజేపీ నేతలు బద్‌నామ్ చేస్తున్నారని విమర్శించారు. యూరియాను కేంద్రం పంపించడంలో విఫలమైందని, రాష్ట్రంలో ఉన్న ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతు నియోజకవర్గంలో ఎమ్మెల్యే నాయకత్వంలో పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకుపోవడానికి అందరం కలిసికట్టుగా పని చేద్దామన్నారు. రాజకీయాలు ఎన్నికల వరకు పరిమితం చేశామన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, సుల్తానాబాద్, పెద్దపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌లు మినుపాల ప్రకాశ్ రావు, ఈర్ల స్వరూప, మాజీ జడ్పీటీసీ సారయ్య గౌడ్, పలు మండలాల అధ్యక్షులు సతీష్, రాజేశ్వర్ రెడ్డి, పన్నాల రాములు, దామోదర్ రావు, కల్లెపల్లి జానీ, అక్బర్, మాజీ ఎంపీపీ రాంమూర్తి, మస్రత్, చక్రధర్, వెంకటేశం, పట్టణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అబ్బయ్యగౌడ్, సతీష్ పాల్గొన్నారు.

వ్యాధుల విజృంభణ

- బెడ్స్ లేక రోగుల అవస్థలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఆసుపత్రుల్లో బెడ్స్ దొరకక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రోగులు భారీగా వచ్చారు. 1581 ఓపీ నమోదు కాగా అందులో 81మంది ఇన్ పేషెంట్లుగా జాయిన్ అయ్యారు. ఒకే మంచంపై ముగ్గురికి చికిత్సను అందిస్తుండగా బెడ్లు సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. గర్భిణీ వార్డులో కూడా ఒకే బెడ్‌పై ఇద్దరికి వైద్య సేవలందిస్తున్నారు. వంద పడకల ఆసుపత్రి నుంచి అప్‌గ్రేడ్ అయిన గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి 362 పడకల ఆసుపత్రిగా మారినప్పటికీ బెడ్ల కొరత ఉంది. కేవలం 260 బెడ్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మిగతా బెడ్లను మెడికల్ కళాశాలకు, ఇతర డిపార్ట్‌మెంట్లలో వినియోగించడం వల్ల రోగులకు బెడ్లు లభించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నూతన భవనం, ఓల్డ్ బిల్డింగ్ రోగులతో కిక్కిరిసిపోయింది. పిడియార్టిక్ వార్డులో ఒకే బెడ్‌పై ముగ్గురికి వైద్య సేవలు అందిస్తుండగా ఆదివారం రాత్రి నిద్రలో ఓ బాలుడు బెడ్‌పై నుంచి కిందపడ్డాడు. వారం రోజులుగా జనరల్ ఆసుపత్రిలోని ఓపీల వద్ద భారీ సంఖ్యలో రోగులు క్యూ కడుతుండగా సరిపోయే మందులు కూడా లభించడం లేదు. మందులు బయట కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఆసుపత్రిలో బెడ్ల సంఖ్యలో పెంచి రోగులకు మెరుగైన వైద్యం అందించాల్సిన అవసరం ఉంది.

సుల్తానాబాద్‌లో ఒకరికి డెంగీ



డెంగీ బాధితుడి ఇంట్లో స్ప్రే చేస్తున్న వైద్య సిబ్బంది

సుల్తానాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ బస్టాండ్ సమీపంలో ఒకరికి డెంగీ పాజిటివ్‌గా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది గుర్తించారు. వారం రోజుల క్రితం అస్వస్థతకు గురి కావడంతో అతడిని కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ జరిపిన పరీక్షలలో డెంగ్యూ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. అతడిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించగా రెండు రోజుల క్రితం సుల్తానాబాద్‌కు వచ్చారు. విషయం తెలిసిన వైద్య ఆరోగ్య, మున్సిపల్ సిబ్బంది బాధితుడి ఇంటితో పాటు సమీప నివాస ప్రాంతాలలో దోమల వ్యాప్తి చెందకుండా మలాథియాన్ స్ప్రే చేశారు. మున్సిపల్ కమిషనర్ రమేష్ బాధితుడి నివాసాన్ని పరిశీలించారు. వైద్య సిబ్బంది చైతన్య, ఏఎన్ఎం రమాదేవి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

- బీజేపీ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న బీజేపీ శ్రేణులు

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదని సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు రైతుల కోసం అనేక హామీలు ఇచ్చిందని, ఇంతవరకు ఏ ఒక్క అంశాన్ని పరిష్కరించలేదన్నారు. రైతు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రెండులక్షల వరకు రుణమాఫీ చేస్తామని, ఇంత వరకు రైతు రుణమాఫీ కేవలం సగం మాత్రమే జరిగిందన్నారు. మూడు నెలలు దాటినా సన్న వడ్ల బోనస్ చెల్లించలేదన్నారు. కౌలు రైతుకు ఎకరానికి 12 వేల రూపాయలు, రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ పథకం కింద ఆర్థిక సాయం ఇవ్వలేదని వివరించారు. తంగెడ రాజేశ్వరరావు, పోల్సాని సంపత్ రావు, రాకేష్, కారంగుల శ్రీనివాస్, మేకల శ్రీనివాస్, ఈర్ల శంకర్, వల్లే తిరుపతి, మల్లయ్య శివయ్య, పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్‌తో ఆలయ అభివృద్ధికి కృషి





సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రమాణ స్వీకారం చేస్తున్న పాలకమండలి

ఓదెల, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మాస్టర్ ప్లాన్‌తో ఆలయ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం మల్లికార్జున స్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ సభను నిర్వహించారు. మంత్రి, ఎమ్మెల్సీ భాను ప్రసాద్‌రావు, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ 20 నెలల్లోనే ఓదెల మండలంలో ఎమ్మెల్యే విజయరమణారావు రూ.200 కోట్ల నిధులు ఖర్చు చేశారని తెలిపారు. రాష్ట్రంలో టెంపుల్ సిటీ ఆర్కిటిక్ సిద్ధం చేసేందుకు సీఎంను సంప్రదిస్తామన్నారు. ఆలయంలో గెస్ట్‌హౌస్ నిర్మాణానికి మంత్రి శ్రీధర్‌బాబును కోరుతామని తెలిపారు. అనంతరం ఒగ్గు పూజారులకు టికెట్ మీద రూ.35 పెంచుతూ జారీ చేసిన జీవో కాపీలను అందజేశారు. ఆలయ అభివృద్ధిలో పాలకవర్గం అతి కీలకమని, మల్లికార్జున స్వామి దయతో విజయరమణారావును మంత్రిగా చూడాలని ఎమ్మెల్సీ భానుప్రసాద్ రావు ఆశాభావం వ్యక్తం చేశారు. మల్లికార్జున స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలనేది నా కోరిక అని ఎమ్మెల్యే విజయరామణరావు అన్నారు. ఓదెల కోర్టుకు సొంత భూమిని కేటాయించి భవనాన్ని నిర్మిస్తామన్నారు. గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ఈర్ల స్వరూప, చైర్మన్‌లు ప్రకాష్ రావు, తిరుపతిరెడ్డి, ఆళ్ల సుమన్ రెడ్డి, నరసింహారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, సారయ్య గౌడ్, మాజీ జెడ్పీటిసి సభ్యుడు బొద్దుల లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో పాలకమండలి ప్రమాణ స్వీకారాన్ని దేవాదాయ, ధర్మదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ నాయిని సుప్రియ సమక్షంలో నిర్వహించారు. 12మంది సభ్యులు కాగా అనివార్య కారణాలవల్ల ధర్మకర్త రవి, తాళ్లపల్లి శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేయలేదు. చైర్మన్ చీకట్ల మొండయ్యతోపాటు ధర్మకర్తలు సమ్మిరెడ్డి, శ్రీనివాస్, కొండ శ్రీనివాస్, రవి, కోదాటి మనోహర్‌రావు, గంట రమేష్, రాజారాం, కొమరయ్య, సామల జమున ప్రమాణ స్వీకారం చేశారు. ఈవో సదయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల ఆందోళన

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూరియా కేంద్రం వద్ద రైతులు సోమవారం ఉదయం పెద్ద ఎత్తున క్యూ కట్టారు. అందరికీ యూరియా బస్తాలు అందినట్లు వారు పేర్కొన్నారు. సింగిల్ విండో చైర్మన్ చదువు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సింగిల్ విండో ద్వారా రైతులకు సరిపడే యూరియాను అందుబాటులో ఉంచామన్నారు. గతేడాది 520 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించగా, ప్రస్తుతం ఇప్పటి వరకు 620 మెట్రిక్ టన్నుల యూరియాను అందించినట్లు తెలిపారు.

మంథని : యూరియా స్టాక్ లేక పోవడాన్ని నిరసిస్తూ స్థానిక సింగిల్‌విండో కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో రైతులు ఆందోళనకు దిగారు. మండలం లోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు పీఏసీఎస్ వద్దకు రాగా సిబ్బంది స్టాక్ లేదన్నారు. దీంతో అక్కడి చేరుకున్న సీపీఎం నేతలు రైతులతో కలిసి కార్యాలయం ఎదట ధర్నా చేశారు. రైతులకు సరిపడ యూరియాను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. వ్యవసాయాధికారులు స్టాక్ ఉందని చెప్పతున్నప్పటి క్షేత్ర స్థాయిలో దొరకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఎం నాయకులు బూడిద గణేష్, ఆర్ల సందీప్, గొర్రెంకల సురేష్‌లు ఉన్నారు.





మంథని పీఏసీఎస్ ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నేతలు, కాల్వశ్రీరాంపూర్‌లో రైతుల క్యూ

గణేష్ మండప నిర్వాహకులు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఏసీపీ మడత రమేష్

కోల్‌సిటీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గణేష్ మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని ఏసీపీ మడత రమేష్ సూచించారు. సోమవారం మార్కండేయకాలనీలోని ఒక ఫంక్షన్‌హాల్‌లో నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించారు. శాంతియుత వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించుకోవాలని, విగ్రహాలు ఏర్పాటు చేసే వారు ఆన్‌లైన్‌లో అనుమతులు పొందాలని, విద్యుత్ కనెక్షన్ల విషయంలో జాగ్రత్తలు పాటించాలని, డీజేలకు అనుమతి లేదని, రాత్రి 10గంటలు దాటితే మైకులు వాడ వద్దన్నారు. రోడ్లను బ్లాక్ చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని, పాయింట్ బుక్‌లను ఏర్పాటు చేసుకుని నిర్వాహకుల పేరు, చిరునామా ఉండాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐలు ఇంద్రసేనారెడ్డి, ప్రసాద్‌రావు, ప్రవీణ్‌కుమార్, ఎస్ఐలు రమేష్, భూమేష్, అనూష, సంధ్యారాణి పాల్గొన్నారు.

శభాష్ చికిత

- ప్రపంచ యూత్ చాంపియన్ షిప్ సాధించిన భారత తొలి ఆర్చరీ క్రీడాకారిణిగా రికార్డు
- ఎలిగేడు మండల వాసి ఘనత

7

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

పేరు మార్పు ప్రకటన

★ పేష్, నెం. 2623554 P, హోదా : సిపాయి, యూనిట్ : 26 మద్రాస్, ప్రస్తుతం నివసిస్తున్న చిరునామా : గృహ నెం. 3-58, గ్రామం & తపాల కార్యాలయం : బుగ్గారం, తాలూకా & జిల్లా : జగిత్యాల, రాష్ట్రం : తెలంగాణ, పిన్‌కోడ్ : 505454, నేను నా తండ్రి : పేరు "కె. నారాయణ" నుండి "కంది నారాయణ" గా మార్చుకున్నాను. ఈ మార్పు అఫిడవిట్ రూపంలో జగిత్యాలలోని అడ్వకేట్ & నోటరీ ... ద్వారా ధృవీకరించబడింది. తేది : 25/08/2025

AJK-238530

పేరు మార్పు ప్రకటన

★ పేష్, నెం. 2623554 P, హోదా : సిపాయి, యూనిట్ : 26 మద్రాస్, ప్రస్తుతం నివసిస్తున్న చిరునామా: గృహ నెం.3-58, గ్రామం & తపాల కార్యాలయం : బుగ్గారం, తాలూకా & జిల్లా : జగిత్యాల, రాష్ట్రం: తెలంగాణ, పిన్‌కోడ్: 505454, నేను నా తల్లి : పేరు "కె. లక్ష్మి" నుండి "కంది లక్ష్మి" గా మార్చుకున్నాను. ఈ మార్పు అఫిడవిట్ రూపంలో జగిత్యాలలోని అడ్వకేట్ & నోటరీ ... ద్వారా ధృవీకరించబడింది. తేది : 25/08/2025

AJK-238531

పాస్‌పోర్ట్ పోయినది

★ I HAVE LOST MY PASSPORT NO. K3363892, WHILE TRAVELLING FROM HOME TO CHOWRASTA IN AN AUTO, AND IT IS BEYOND RECOVERY. IF FOUND, KINDLY CONTACT SHIRISHA (D/O. KISHAN RAO) AT 9160274731.

AJK-

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, పట్ల వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించబడు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

3+2 స్కీం కలదు

ఆంధ్రజ్యోతి ప్రకటనలకై సంప్ర: 99854 11174

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి

కరీంనగర్ :- సెల్: 9703618691, 99854 10640

జగిత్యాల, మెట్‌పల్లి :- సెల్ : 99854 11262

వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063



రూ.7650 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.7650 పలికింది. సోమవారం మార్కెట్‌యార్డుకు ముగ్గురు రైతులు 10క్వింటాళ్లు విడిపత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వార గరిష్ఠ ధర రూ.7650 చెల్లించారు.

పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్ అప్పగింత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలకు చెందిన రాళ్లబండి సత్యనారాయణ ఆగస్టు16న కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్‌లో మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఈమేరకు కరీంనగర్‌రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఫోన్ పెద్దపల్లిలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. యజమాని సత్యనారాయణకు కరీంనగర్‌రూరల్ ఠాణాలో సోమవారం సీఐ నిరంజన్‌రెడ్డి ఫోన్ అప్పగించారు. ఫోన్‌ను పట్టుకోవడంలో కృషి చేసిన కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా కరీంనగర్ రూరల్ మండలం చేగుర్తివాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. కాల్వల శివకుమార్‌పై కేసునమోదుచేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

వృద్ధురాలిని కాపాడిన అగ్నిమాపక సిబ్బంది

చొప్పదండి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి పట్టణంలోని 13వవార్డులో పంచల భాగ్యలక్ష్మి(65) ప్రమాదవశాత్తు చేదబావిలో పడింది. సమాచారం అందుకున్న చొప్పదండి ఫైర్‌స్టేషన్ అధికారి పవన్ సిబ్బందితో కలిసి బావివద్దకు చేరుకుని వృద్ధురాలిని రక్షించారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

వీణవంక, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామశివారులో సోమవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో దంపతులకు గాయాలయ్యాయి. హిమ్మత్‌నగర్ గ్రామానికిచెందిన ఉండాటి సారయ్య తన భార్యతో కలిసి బైక్‌పై వెళ్తున్నాడు. ఈక్రమంలో పోతిరెడ్డిపల్లి గ్రామశివారులో రోడ్డు పూర్తిగా గుంతలుగా మారడంతో అదుపుతప్పి దంపతులిద్దరూ బైక్ నుంచి కింద పడిపోయారు. దీంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వారిని చికిత్సనిమిత్తం జమ్మికుంట ఆసుపత్రికి తరలించారు.


గాయపడిన మహిళ

ఉపాధిహామీలో సీసీ రోడ్లకు స్వస్తి


కందుగుల గ్రామంలో పశువుల పాక నిర్మాణానికి ముగ్గు పోస్తున్న ఆర్డీవో రమేష్‌బాబు

- కేంద్ర బృందం హెచ్చరికలతో మారిన పనుల ఎంపిక తీరు
- రైతులకు లబ్ధి చేకూర్చే పనులకే ప్రాధాన్యం

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనులను ఆసరాగా తీసుకుని కొందరు అక్రమాలకు పాల్పడుతుండడాన్ని పరిశీలించిన కేంద్ర బృందం పనుల ఎంపిక తీరును పూర్తిగా మార్చింది. సీసీ రోడ్ల నిర్మాణానికి ఉపాధి నిధులు ఇవ్వబోమని హెచ్చరించడంతో ఈ సారి ఉపాధి పనుల తీరు మారనున్నాయి.

రోడ్ల నిర్మాణాల్లో భారీ అక్రమాలే కారణమా..?

ఉపాధి హామీ పథకం నిధులను ఏటా సీసీ రోడ్ల నిర్మాణానికి కేటాయించడం పరిపాటైపోయింది. ఈ రోడ్ల నిర్మాణంలో అంతే స్థాయిలో అక్రమాలు సాధారణమైపోయాయి. మెటీరియల్ కాంపోనెంట్ కింద అందుబాటులో ఉన్న ఉపాధి హామీ నిధుల్లో 80 శాతం వరకు సీసీ రోడ్లకే వెచ్చించే వారు. స్థానిక గ్రామపంచాయతీల తీర్మానాల పేరుతో మొక్కుబడి పనులు చేయడం, లక్షల్లో నిధులు నొక్కేయడం పరిపాటిగా మారింది. రెండు, మూడు దశాబ్దాలపాటు ఉండాల్సిన సీసీ రోడ్లను నాసిరకంగా నిర్మించడంతో రెండు, మూడేళ్లకు పగుళ్లు రావడం, కంకర తేలి కనిపిస్తుండడాన్ని కేంద్ర బృందం గమనించింది. దీంతో కేంద్ర బృందం ఈ సారి సీసీ రోడ్లకు కేటాయింపులు తగ్గించాలని ఆదేశించింది.

వ్యవసాయ అనుబంధ పనులివే...

గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేద వ్యవసాయ కూలీల వలసలను నివారించి స్థానికంగా పనులు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ పథకం కింద వచ్చే మెటీరియల్ కాంపోనెంట్ నిధులను పశువుల పాకలు, గొర్రెల షెడ్లు, పౌల్ట్రీఫాంలు, నాడెపు కంపోస్టు షెడ్లు, అజోలా ట్యాంకులు, చెక్ డ్యాంలు, నీటి కుంటలు వంటి పనులకు వెచ్చిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పనుల జాతర పేరుతో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, పీఆర్ ఇంజనీరింగ్, గ్రామీణ నీటిసరఫరా, స్వచ్ఛభారత్ మిషన్ తదితర విభాగాల సమన్వయంతో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించింది. ఇందులో అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ భవనాలు, పాఠశాలల్లో మురుగుదొడ్ల నిర్మాణం వంటి పనులను చేపట్టనున్నారు. హుజూరాబాద్ మండలంలో 88.78 లక్షలతో ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్నారు.

ఎంపిక చేసిన పనులను ప్రారంభిస్తాం..
తూర్పాటి సునీత, ఎంపీడీవో, హుజూరాబాద్



ఉపాధిహామీ పనుల జాతర కింద ఆయా గ్రామాల్లో గుర్తించిన పనులు చేపట్టనున్నాం. అత్యంత పారదర్శకంగా పనులు జరిగేలా పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నాం. ఉపాధి హామీ పథకం కింద గ్రామాలకు లబ్ధి చేకూరే పనులకు శ్రీకారం చుట్టాం.

మట్టిని తరలిస్తున్న టిప్పర్లను పట్టుకున్న గ్రామస్థులు

మానకొండూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టుదుద్దెనపల్లిలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్‌లను గ్రామస్థులు పట్టుకున్నారు. కొంత కాలంగా గట్టుదుద్దెనపల్లి-పోలంపల్లి గ్రామాల మధ్య ఉన్న పెద్దగుట్ట నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తుండగా సోమవారం గ్రామస్థులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మట్టిని తరలిస్తున్న టిప్పర్‌లను అడ్డుకొని రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఆర్ఐ ప్రీతి, పంచాయతీ కార్యదర్శి ఆనంద్ టిప్పర్‌లను సీజ్‌చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. గ్రామస్థులు పెంచాల రాజయ్య, ఆకుల నర్సింగరావు, కనకం కుమార్, పాండ్రాల కనుకరాజేశం, గొండ తిరుపతి ఉన్నారు.


పట్టుకున్న వాహనాలతో గ్రామస్థులు

పొలంలో జారి పడి రైతు మృతి

మల్యాల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం నూకపల్లిలో పొలానికి నీళ్లు పెట్టడానికి వెళ్లిన గంగారాం (75) అనే రైతుకు సోమవారం ఛాతి నొప్పిరావడంతో బురదలో కూరుకుపోయి మృతిచెందాడు. ఎస్సై నరేశ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గంగారాం రెండు రోజులుగా ఛాతి నొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో గ్రామ శివారులోని తన పంటచేను వద్దకు వెళ్లిన గంగారాం పంప్‌సెట్ వద్ద మోటార్ స్టార్ట్ చేస్తుండగా ఛాతిలో మళ్లీనొప్పి రావడంతో అక్కడే పొలం బురదలో బోర్లపడి కూరు కుపోయాడు. దీంతో ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య కాంతవ్వ ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.


గంగారాం(ఫైల్)

ద్విచక్రవాహనాల దొంగ అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా బిక్కవోలు మండలం వూలపల్లి గ్రామానికి చెందిన అంతరాష్ట్ర దొంగ అంబటి రాంబాబు (41)ని సోమవారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ మహేష్ బి. గీతే తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.... రాంబాబు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఆన్‌లైన్ గేమ్స్‌లో డబ్బులు పోగొట్టుకొని ఎలాగైనా సులభంగా డబ్బులు సంపాదించాలని దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నాడు. కాకినాడలో 2019లో ఓ ఇంటిలో దొంగతనానికి పాల్పడగా అడ్డువచ్చిన ఇద్దరు వ్యక్తులను రాంబాబు హత్య చేసి జైలు కు వెళ్లి వచ్చాడు. ఆ తర్వాత హైద్రాబాద్‌కు మకాం మార్చి ద్విచక్రవాహనాలను దొంగతనం చేస్తున్నాడు. ఈ క్రమంలో గుంటూరుకు చెందిన మంద్రు నారాయణ ఉద్యోగ నిమిత్తం జూన్ 1న సిరిసిల్లకు ద్విచక్రవాహనంపై వచ్చి తిరిగి కరీంనగర్‌కు వెలుతుండగా మార్గమధ్యలో వెంకట్రావుపల్లి వద్ద గల హోటల్ వద్ద పార్క్‌చేసి టిఫిన్ చేసేందుకు వెళ్లాడు. టిఫిన్ చేసి తిరిగి వచ్చే వరకు నారాయణ ద్విచక్ర వాహనం కనిపించలేదు. ఈ మేరకు బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తులో భాగంగా సాంకేతికత ఆధారంగా ద్విచక్రవాహనాల దొంగ అంబటి రాంబాబును హైద్రాబాద్‌లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా దొంగ తనం చేసినట్లు అంగీకరించాడు. నాలుగు సంవత్సరాలుగా 22ద్విచక్రవాహనాలు దొంగిలించాడు. ఇతని వద్ద 8ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకొని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్పీ తెలిపారు. దొంగను చాకచక్యంగా పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నటేశ్, ఎస్ఐలు రమాకాంత్, శ్రీకాంత్, కానిస్టేబుల్స్ తిరుపతి, రాజేశ్, శ్రీనివాస్, మహిపాల్, ఉమాపతి, శివలను ఎస్పీ అభినందించారు.


దొంగను అరెస్ట్ చూపుతున్న ఎస్పీ మహేష్ బి గీతే

బావిలో పడిన బాలుడి మృతదేహం లభ్యం

సైదాపూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయికల్ గ్రామంలో ఆదివారం ఆడుకుంటూ వెళ్లి వ్యవసాయబావిలో పడిన బాలుడు హర్షిత్ నందన(18నెలలు) మృతదేహం సోమవారం లభ్యమయింది. పోలీసులు, గ్రామస్థులు బావిలో నీటిని మోటార్లతో పూర్తిగా బయటకు తోడి మృతదేహాన్ని బయటకు తీశారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. బాలుడి తండ్రి వెంకటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సీహెచ్ తిరుపతి తెలిపారు.


హర్షిత్ నందన(ఫైల్)

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మానకొండూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన పప్పు అనిల్‌కుమార్(30) చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. అన్నారం గ్రామానికి చెందిన పప్పు సారమ్మ-రాజేశం దంపతులకు కుమారుడు అనిల్‌కుమార్, కూతురు ఉన్నారు. ఇద్దరికి వివాహాలు జరగగా రాజేశం గతంలోనే అనారోగ్యంతో మృతిచెందాడు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఈనెల23న సదాశివపల్లి ప్రాంతంలో అనిల్‌కుమార్ గడ్డిమందు తాగాడు. గ్రామస్థుల ద్వారా సమాచారం అందడంతో కుటుంబ సభ్యులు కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నగరంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఒక్క కొడుకు మృతిచెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి. మృతుడు అనిల్‌కుమార్ తల్లి సారమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంజీవ్ తెలిపారు.


అనిల్‌కుమార్(ఫైల్)

పురుగుల మందుతాగి వివాహిత ఆత్మహత్య

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన జాగిలం లక్ష్మి(46) పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. లక్ష్మి కూతురు రవళికి 18నెలల క్రితం ఆశన్నపల్లి గ్రామానికి చెందిన రవితో వివాహం జరిగింది. మూడు నెలలు కాపురం చేసిన రవళి ప్రస్తుతం ఇప్పలిపల్లిలోని తల్లి గారింటిలో ఉంటున్నది. రవళి మానసిక స్థితి సరిగా లేకపోవడంతో లక్ష్మి నిత్యం కుమిలిపోయేది. ఈ క్రమంలో ఆమె ఈనెల23న పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు కాల్వశ్రీరాంపూర్ ఆసుపత్రికి, అనంతరం మెరుగైనవైద్యంకోసం కరీంనగర్‌కు తరలించారు.అక్కడచికిత్స పొందుతూ సోమవారం లక్ష్మి మృతిచెందింది. కుటుబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


జాగిలం లక్ష్మి(ఫైల్)

ఒడ్డు పైనుంచి పొలంలో పడి రైతు హఠాన్మరణం

ముస్తాబాద్, అగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతుగల్ గ్రామానికి చెందిన కొప్పు శివరాజ్(50) అనే రైతు పొలం వద్ద ఒడ్డు పైనుంచి కింద పడి మృతిచెందాడు. ఎస్సై గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం పొలానికి నీరు పెట్టి వస్తానని వెళ్లిన శివరాజ్ ప్రమాదవశాత్తు కాలుజారి ఒడ్డు పైనుంచి పొలంలో బోర్లా పడిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


శివరాజ్(ఫైల్)

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

జగిత్యాల క్రైం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన అనీల్‌ప్రసాద్(37) అనేవ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. రెండు నెలల క్రితం అనీల్ ప్రసాద్ జిల్లా కేంద్రంలోని యావర్ రోడ్డులో ద్విచక్రవాహనం నడుపుతూ కిందపడిపోగా తీవ్ర గాయాలయ్యాయి. జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతిచెందాడు. మృతుడి భార్య పూర్ణిమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

జ్వరంతో చిన్నారి మృతి

తంగళ్లపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన సౌరుగు బాలయ్య-సంధ్య దంపతుల కూతురు సహస్ర(8) డెంగ్యూతో సోమవారం మృతిచెందింది. కుటుంబ సభ్యుల కథనంప్రకారం.. తంగళ్లపల్లి గ్రామం ఇందిరానగర్‌కు చెందిన సహస్ర సిరిసిల్లలోని ఓ ప్రైవేటుపాఠశాలలో రెండోతరగతి చదువుతోంది. నాలుగురోజుల క్రితం సహస్ర జ్వరం బారిన పడింది. శనివారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా పరిస్థితి విషమంగా మారింది. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం ఆదివారం తెల్లవారుజామున హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ ఆసుపత్రిలో వైద్యపరీక్షలు నిర్వహించగా డెంగ్యూ పాజిటివ్ అని తేలింది. చికిత్స పొందుతూ సహస్ర సోమవారం మృతిచెందింది.


సహస్ర(ఫైల్)


రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారు లోని కొత్తపల్లి వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమా దంలో గంగాధర మండలం గోపాల్‌రావుపల్లికి చెందిన పోతరవేని కొమురయ్య(73) మృతిచెందా డని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. కొము రయ్య బైక్‌పై వెనుక కూర్చున్నాడని, ముందున్న బైక్‌ను ఢీకొనడంతో ఎగిరికింద పడి తీవ్రంగా గాయపడ్డాని పేర్కొన్నారు. కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కొమురయ్య మధ్యా హ్నం మృతి చెందాడని, కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఆటోలో నుంచి కింద పడి డ్రైవర్ మృతి

జగిత్యాల క్రైం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆటోలో నుంచి కింద పడి జగిత్యాల జిల్లా కేంద్రంలోని నూకపెల్లి హౌజింగ్ కాలనీకి చెందిన డ్రైవర్ షేక్ రజాక్(38) మృతిచెందాడు. రజాక్ జగిత్యాల కొత్తబస్టాండ్ ప్రాంతంలో తన ఆటోను ఆదివారం రాత్రి నడుపుతూ కింద పడిపోయాడు. తీవ్ర గాయాలై జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. మృతుని భార్య రిజ్వాన ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే కవ్వంపల్లికి పలువురి పరామర్శ


కవ్వంపల్లిని పరామర్శిస్తున్న వివిధ పార్టీల నాయకులు

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణను వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు సోమవారం పరామర్శించారు. ఆరు రోజుల కిందట ఎమ్మెల్యే సోదరుడు కవ్వంపల్లి రాజేశం అనారోగ్యంతో మరణించారు. సోమవారం కరీంనగర్‌లోని వాల్మీకినగర్‌లో ఎమ్మెల్యే నివాసంలో కలిశారు. పెద్దపల్లి ఎమ్మెల్యే సీహెచ్ విజయరమణారావు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, కౌన్సిల్ సభ్యులు అందె స్వామి, పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు టేకుమల్ల సమ్మయ్య, బోయిని తిరుపతి, న్యాలపట్ల రాజు, బూడిద సదాశివ ఉన్నారు.

డీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం, జగిత్యాల జిల్లాకాంగ్రెస్ ముఖ్యనేత జువ్వాడి నర్సింగరావు, కిమ్స్ రవీందర్ రావు, టీపీసీసీ ప్రధానకార్యదర్శి ఈర్ల కొమురయ్య, కాంగ్రెస్ నాయకులు జైపాల్, జొన్నల రమేష్, మాదాసు శ్రీనివాస్, కూడలి దామోదర్, గజ్జెల స్వామి, టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రబెల్లి రవీందర్, టీడీపీ ఆర్టీఐ విభాగం జిల్లాఅధ్యక్షులు దాసరి రామకృష్ణారెడ్డి, జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరి రమేష్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ దేశినికోటి, పార్టీ నాయకులు దొంత రమేష్, జిల్లెల్ల తిరుపతిగౌడ్, మిడిదొడ్డి రాజు ఉన్నారు.

కిలాడీ దంపతుల అరెస్ట్

- వస్త్ర పరిశ్రమ పేరుతో రూ.1.10 కోట్లు వసూలు చేసి ఉడాయింపు

కోరుట్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కోరుట్లపట్టణంలో వస్త్రపరిశ్రమ స్థాపిస్తున్నానని దానిలో పెట్టుబడులు పెట్టాలని పలువురి వద్ద రూ.1,10,40,000 వసూలు చేసి తప్పించుకు తిరుగుతున్న కిలాడీ దంపతులను సోమవారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలను కోరుట్ల ఎస్ఐ చిరంజీవి సోమవారం వెల్లడించాడు. కోరుట్ల పట్టణంలోని కాల్వగడ్డ ప్రాంతానికి చెందిన రహమతి బేగం, మహమ్మద్ గౌసుద్దీన్‌లు 2023 సంవత్సరంలో కోరుట్ల పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వారి వద్ద వస్త్ర పరిశ్రమ పెడుతున్నామని, అందులో వాటా ఇస్తామని డబ్బులు వసూలు చేశారు. అనంతరం నిందితులు తప్పించుకొని తిరుగుతుండగా బాధితులు 2023లో కోరుట్ల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. పోలీసుల దర్యాప్తులో పరారీలో ఉన్న రహమతి బేగం ఆమెభర్త గౌసుద్దిన్ వాజిద్ హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించారు. ఈనెల 24న అక్కడికి వెళ్లి వారిని అదుపులోకి తీసుకొని కోరుట్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. 2023 నమోదు చేసిన కేసులో రహమతి బేగం, మహమ్మద్ గౌసుద్దీన్ దంపతులను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా పలువురి వద్ద తీసుకున్న డబ్బులతో రహమతి బేగం కుమారుడిని చదువుల కోసం లండన్‌కు పంపించి హైదరాబాదులో విలాసమతమైన జీవితం గడుపుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. గతంలో కూడా రహమతి బేగంపై కోరుట్ల పోలీస్ స్టేషన్‌తో పాటు జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్‌లో కేసులు ఉన్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

తండ్రి మందలించాడని మనస్తాపంతో తనయుడి బలవన్మరణం


నవీన్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగవద్దని తండ్రి మందలించడంతో మనస్థాపం చెందిన తనయుడు పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. ఎల్లారెడ్డిపేట మండలం బుగ్గరాజేశ్వరతండాకు చెందిన గుగులోతు లక్ష్మి- బాపురావు దంపతులకు ముగ్గురు కొడుకులు నరేశ్, అనిల్, నవీన్, కూతురు సంగీత ఉన్నారు. చిన్న కొడుకు నవీన్(24) రెండేళ్ల క్రితం దుబాయి వెళ్లి ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. ఈనెల 21న వివాహ వేడుకలకు హాజరైన యువకుడు మద్యం మత్తులో ఇంటికి చేరుకున్నాడు. మద్యం తాగవద్దని తండ్రి బాపురావు మందలించాడు. దీంతో మనస్థాపం చెందిన నవీన్ అదేరోజు పురుగుల మందు తాగి అపస్మారకస్థితిలో పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని మండలకేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మూడు రోజులుగా చికిత్స పొందుతున్న నవీన్ పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

కేంద్ర ప్రభుత్వానికి అధికారంలో కొనసాగే అర్హత లేదు

గణేశ్‌నగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఓట్లను దొంగలించిన ప్రభుత్వంగా పేరుగాంచిన కేంద్ర ప్రభుత్వానికి అధికారంలో కొనసాగే అర్హత లేదని యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర సెక్రెటరీ, గాంధీగ్లోబల్ ఫ్యామిలీజ్యాన్ ప్రతిష్ఠ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఉమ్మెంతుల శ్యాంసుందర్ రెడ్డి అన్నారు. ఓట్ చోర్ మోదీ హఠావో దేశ్‌కి బచావో అనే నినాదంతో మూడు రోజులుగా గీతాభవన్ చౌరస్తా వద్ద చేపట్టిన రిలేనిరాహారదీక్షను సోమవారం విరమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బీజేపీ పెద్దలు విచ్చలవిడిగా ఓట్లను దొంగిలిస్తున్నారని ఆరోపించారు. ఎలక్షన్ కమిషన్ స్పందించి జాబితాను తొలగించాలని డిమాండ్ చేశారు. అంతకుముందు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆకారపు భాస్కర్‌రెడ్డి, మైనారిటీ సెల్ జిల్లాఅధ్యక్షుడు తాజుద్దీన్ దీక్షకు సంఘీభావం తెలిపారు. యూత్‌కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బోయిన కృష్ణబాబు, కిమ్‌వహద్, సయ్యద్‌సజాద్, తాళ్లపల్లి శ్రీకాంత్, అజీమ్,ఎల్కపెల్లిసిద్ధార్థ, పురుషోత్తం,వడ్డేపల్లి విష్ణువర్ధన్, ఉమ్మెత్తలా ఆశీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న సీనియర్ నాయకులు ఆకారపు భాస్కర్‌రెడ్డి

కల్వచర్లలో భారీ చోరీ

- 15 తులాల బంగారం ● 20 తులాల వెండి అపహరణ

రామగిరి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల గ్రామ పంచాయతీ పరిధి గొల్లపల్లి ఐఓసీ పెట్రోల్ బంక్ సమీపంలోని గడల రాంబాబు ఇంట్లో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. తాళంవేసిఉన్న ఇంటిని గుర్తించిన దొంగలు ప్రధాన ఇంటిద్వారం తాళం పగలగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువాలోని పదిహేను తులాల బంగారం, 20తులాల వెండిచోరీ చేశారు. శుక్రవారం రాంబాబు భార్య పావనితో కరీంనగర్‌లోని అత్తారింటికి వెళ్లారు. రాంబాబు తల్లిలక్ష్మి శనివారం ఉదయం కూతురు సుమలత అనారోగ్యంతో ఉన్న కారణంగా మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ వెళ్లింది. సోమవారం సాయంత్రం లక్ష్మి ఇంటికిరాగా తాళంపగిలి ఉండడాన్ని గమనించింది. చుట్టుపక్కల వారితో పాటు కొడుకు రాంబాబుకు సమాచారం ఇచ్చింది. రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘటనస్థలాన్ని మంథని సీఐ రాజు, ఎస్సై దివ్యలు పరిశీలించి కేసు నమోదు చేశారు.


విచారణ చేస్తున్న ఎస్సై దివ్య

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

తంగళ్లపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. మండలంలోని ఇందిరమ్మకాలనీకి చెందిన డీసీఎం వ్యాన్‌డ్రైవర్ కొంగరి నరేష్(35) తమ బంధువు అంత్యక్రియలకు హాజరై ద్విచక్రవాహనంపై సిరిసిల్ల నుంచి ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన బోలేరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నరేష్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపించారు. బోలేరో డ్రైవర్‌ను అదపులోకి తీసుకున్నట్లు తెలి సింది. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తి మృతి

జమ్మికుంట రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం గండ్రపల్లి గ్రామ చెరువులో ట్రాక్టర్ బోల్తాపడి ఓర్సు లింగయ్య (56) అనేవ్యక్తి సోమవారం మృత్యువాతపడ్డాడు. పోలీస్‌లుతెలిపిన వివరాల ప్రకారం.. గండ్రపల్లికి చెందిన లింగయ్య అదే గ్రామంలోని రామకృష్ణ అనే రైతు పొలంలో నాట్లు వేసేందుకు ట్రాక్టర్‌లో కూలీలను తీసుకువెళ్లాడు. వారిని పొలం వద్ద దింపి చెరువు కట్టపై నుంచి వస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ చెరువులో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లింగయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు లింగయ్య కుమారుడు రాజ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రామకృష్ణగౌడ్ తెలిపారు.

శభాష్ చికిత



- ప్రపంచ యూత్ చాంపియన్ షిప్ సాధించిన భారత తొలి ఆర్చరీ క్రీడాకారిణిగా రికార్డు
- ఎలిగేడు మండల వాసి ఘనత


ఎలిగేడు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామానికి చెందిన యువతి క్రీడారంగంలో అరుదైన ఘనత సాధించింది. కెనడాలో జరిగిన ఆర్చరీ పోటీల్లో తానిపర్తి చికిత ప్రపంచ స్థాయి విజేతగా నిలిచి భారత దేశ కీర్తిని నిలబెట్టింది. ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన చికిత ఆర్చరీలో బంగారు పతకం సాధించి భారత తొలి క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. సుల్తాన్‌పూర్ గ్రామంలో వ్యవసాయం చేసుకునే తానిపర్తి శ్రీలత శ్రీనివాస్‌రావు దంపతులకు కూతురు చికిత, కుమారుడు యశ్వంత్‌లు ఉన్నారు. చికిత కరీంనగర్ నగునూర్‌లోని ఎస్‌పీఆర్ పాఠశాలలో పదో తరగతి, గర్రెపల్లిలో ఇంటర్మీడియట్, పంజాబ్‌లోని ఎల్‌పీ యూనివర్సిటీలో డిగ్రీ చదువుతోంది. చదువుతో పాటు క్రీడల్లో మక్కువతో ఆర్చరీపై ఆసక్తి పెంచుకుంది. ఆర్చరీలో రాణించాలనే పట్టుదలతో కరీంనగర్‌లోని సిటి పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకుంది. కృషి పట్టుదలతో ఆర్చరీ క్రీడలో నైపుణ్యం సాధించి, రెండు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని రజిత, కాంస్య పతకాలను సాధించింది. ఈ ఏడాదిలో జరిగిన ఆసియా కప్ పోటీల్లో పాల్గొని నాలుగో స్థానంలో నిలిచి త్రుటిలో పతకాన్ని చేజార్చుకుంది. ఈ నెల 24న కెనడాలో ముగిసిన ఆర్చరీ ప్రపంచ చాంపియన్ షిప్ కాంపౌండ్ విభాగం అండర్ 21లో ప్రత్యర్థులను మట్టికరిపించి బంగారం పతకం సాధించి విశ్వవిజేతగా నిలిచింది. ఆర్చరీ క్రీడా విభాగంలో భారత్‌కు తొలి బంగారు పతకాన్ని సాధించి దేశ ప్రతిష్టను ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన చికితను ప్రజలు అభినందిస్తున్నారు. సుల్తాన్‌పూర్ గ్రామస్థులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. చికిత సోదరుడు యశ్వంత్ ఆర్చరీ క్రీడలో జాతీయ స్థాయిలో రాణిస్తూ రాష్ట్రానికి గుర్తింపు తీసుకువస్తున్నారు. క్రీడా కోటాలో యశ్వంత్ బాసరలోని ట్రిపుల్ ఐటీలో సీట్ సాధించి విద్యనభ్యసిస్తున్నాడు.





కెనడాలో బంగారు పతకం అందుకుంటున్న చికిత

డీడీఎన్ అర్చక సంఘం రాష్ట్ర చైర్మన్‌గా శ్రీనివాస సుదర్శన్



కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): డీడీఎన్ అర్చక సంఘం రాష్ట్ర చైర్మన్‌గా చొప్పదండి మండలం గుమ్లాపూర్‌కు చెందిన శిరిశనహళ్ శ్రీనివాస సుదర్శన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హైదరాబాద్ హబ్సిగూడలో ఆదివారం రాత్రి ధూప దీప నైవేద్య పథకం కింద ఉన్న ఆలయాల అర్చకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్చకుల సంక్షేమం కోసం కృషి చేస్తా నన్నారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పెరంబుదూరు శ్రీకాంతాచార్యులు, శఠగోపం శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

కరీంనగర్ నుంచి ఆర్టీసీ టూర్ బస్సు

భగత్‌నగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నుంచి ప్రత్యేక బస్సు నడిపిస్తున్నట్లు కరీంనగర్-1 డిపో మేనేజర్ విజయమాధురి ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ బస్టాండ్‌లో ఈ నెల 29న సాయంత్రం 5 గంటలకు బస్సు బయల్దేరుతుందని, అన్నవరం, పిఠాపురం, శక్తిపీఠం, సింహా చలం, వైజాక్ రిషికొండ బీచ్, ద్వారక తిరుమల క్షేత్రం దర్శనం ఉంటుందని పేర్కొన్నారు. పుణ్యక్షేత్రాల దర్శనం అనంతరం 31వ తేదీ ఆదివారం కరీంనగర్ చేరుకుంటుందని తెలిపారు. సూపర్ లగ్జరీ బస్సులో పెద్దలకు రూ.3500, పిల్లలకు రూ.2625 చొప్పున టికెట్ ధర ఉంటుందని, వివరాలకు 7382849352, 9959225920 సంప్రదించాలని సూచించారు.

మత్స్యకారుడి వలకు చిక్కిన 25కిలోల చేప



తిమ్మాపూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువ మానేరు జలాశయంలో చేపలు పట్టేందుకు వెళ్లిన మత్స్యకారుడికి 25కిలోల చేప వలకు చిక్కింది. మండలంలోని ఇందిరానగర్ గ్రామం సంగంపల్లికి చెందిన మత్స్యకారుడు కూన సంపత్ ఆదివారం మానేరు జలాశయంలో చేపల కోసం వలలు వేశాడు. సోమవారం ఉదయం వలలు తీస్తున్న క్రమంలో అందులో ఓ భారీ బొచ్చ చేప చిక్కింది. దాని బరువు 25కిలోలకు పైగా ఉన్నట్లు తెలిపాడు. రామకృష్ణ కాలనీకి చెందిన ఓ వ్యక్తికి రూ.3500లకు విక్రయించినట్లు తెలిపాడు. చాలాకాలంగా చేపలుపడుతున్నా ఇంత పెద్ద చేప ఎప్పుడు చిక్కలేదని, చాలా సంతోషంగా ఉందని మత్స్యకారుడు సంపత్ తెలిపాడు.

రాజన్న ఆలయ అభివృద్ధిపై పవర్ పాయింట్ ప్రజంటేషన్

వేములవాడ కల్చరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో చేపట్టే పలు అభివృద్ధి పనులపై మంగళవారం సాయంత్రం 4 గంటలకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ నిర్వహించనున్నట్లు ఆలయ పీఆర్వో సోమవారం ప్రకటనలో తెలిపారు. రాజన్న ఆలయ ఓపెన్ స్లాబ్‌లో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రెవెన్యూ, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్, జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా, దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్ వెంకట్రావ్, దేవదాయ శాఖ గౌరవ సలహాదారు గోవింద్‌హరి, ఆర్కిటెక్ట్, స్థపతులు ఆలయ ఇంజనీర్ అధికారులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

కార్యకర్తలను కడుపులో పెట్టుకుంటాం

- బీఆర్ఎస్ ఒక దోపిడీ పార్టీ...
- ఉమ్మడి జిల్లా కార్యకర్తల సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

కరీంనగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): కార్యకర్తలను కడుపులో పెట్టుకుని చూసుకుంటామని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. గంగాధర మం డల శివారులోని వెంకటాయపల్లిలో ఉమ్మడి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీని అధికారంలోకి రావడానికి అహర్నిశలు కృషి చేశారన్నారు. ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. త్వరలోనే నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తున్నామన్నారు. కష్టపడి పనిచేసేవారికి పదవులు దక్కుతాయని, పార్టీ టికెట్లు వస్తాయన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి లక్ష కోట్ల రూపాయలు గోదావరి పాలు చేసిందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఆరు గ్యారంటీలు అమలు చేస్తున్నామన్నారు. పదేళ్లలో కేటీఆర్ 10 వేల కోట్లు విదేశీ పెట్టుబడులు తీసుకు వస్తే, 20 నెలల కాలంలో మంత్రి శ్రీధర్‌బాబు లక్షా 78 వేల కోట్లు పెట్టుబడులు తీసుకు వచ్చారని తెలిపారు. త్వరలో రాష్ట్ర యువతకు 50 వేల ఉద్యోగాలు రాబోతు న్నాయని మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ జనహిత యాత్ర ప్రజా సమస్యలను తెలుసు కోవడానికి చేస్తున్నామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
విప్ ఆది శ్రీనివాస్

గంగాధర: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాని విప్ ఆది శ్రీనివాస్ కార్యకర్తలకు సూచించారు. ప్రజాపాలనలో కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని దేశంలో ముందు వరసలో నిలుపుతున్నారని అన్నారు.

కష్టపడిన కార్యకర్తకు బీ ఫాం ఇస్తాం
ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కష్టపడిన కార్యకర్తలకు బీ ఫాం ఇస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. జనహిత పాదయాత్రను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. మరో పదేళ్ల కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండబోతుందని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి కార్యకర్తను గెలిపించుకుంటామన్నారు.

కాంగ్రెస్‌కు కంచుకోట కరీంనగర్
ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

కాంగ్రెస్ పార్టీకి ఉమ్మడి జిల్లా కంచుకోటగా నిలువబోతోందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. గడీల పాలనను బద్దలు కొట్టి ప్రజా పాలను తీసుకొచ్చామని, మతం పేరిట దేశాన్ని ఏలుతున్న బీజేపీని భూస్థాపితం చేద్దామన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి కార్యకర్తలను గెలిపించుకుని బీజేపీ, బీఆర్ఎస్‌కు గుండు గీయిద్దామన్నారు.

వసతి గృహంలో కాంగ్రెస్ నేతల శ్రమదానం

గంగాధర: జనహిత పాదయాత్రలో భాగంగా సోమవారం కాంగ్రెస్ నాయకులు గంగాధర ఎస్సీ సంక్షేమ బాలుర వసతి గృహంలో శ్రమదానం నిర్వహించారు. ఉదయం ఏడు గంటలకు హాస్టల్‌కు చేరుకుని ఐదు బృందాలుగా విడిపోయారు. ఒక బృందం మట్టిని ఎత్తి గుంతలు పూడ్చితే, మరో బృందం ప్రహరీకి రంగులు వేసింది, మరో బృందం కిచెన్ గార్డెన్ నిర్మించి మట్టి పోసి మొక్కలు నాటింది. మంత్రి పొన్నం ప్రభాకర్ హాస్టల్‌కు రావడంతోనే ఎదురుగా ఉన్న విద్యార్థులను పలకరించారు. పారచేతపట్టి మట్టిని తట్టలో ఎత్తారు. ఎత్తిన మట్టిని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గుంతల్లో పోస్తూ పూడ్చారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ గోడకు సున్నం వేయగా రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ మట్టి ఎత్తారు. విద్యార్థుల స్నానాల గదులను శుభ్రం చేశారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్న కిచెన్ గార్డెన్ నిర్మించి మట్టి పోశారు. టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం, ఏఐసీసీ కార్యదర్శి రుద్ర సంతోష్ పాల్గొన్నారు.

సర్వోదయ సమాజ్ సేవాదళ్ భజన..

కరీంనగర్ అర్బన్: గంగాధరలోని ఎస్సీ గురుకుల వసతి గృహంలో మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో సోమవారం సర్వోదయ సమాజ్ సేవాదల్ భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. కీర్తనలు ఆలపించారు.

ఎస్సారెస్పీకి 29,907 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి సోమవారం 29,907 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా వరద గేట్లు పైకి ఎత్తడం, కాకతీయ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 29,907 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో వరద కాలువకు 20,000 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 3,500 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 150 క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 500 క్యూసెక్కులు, అలీ సాగర్ ఎత్తిపోతల పథకానికి 360 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతోంది. మూడు రోజులుగా ప్రాజెక్టుకు చెందిన గేట్లను పైకి ఎత్తి గోదావరిలోకి నీటిని వదులుతుండగా ఇన్‌ఫ్లో తగ్గడంతో మధ్యాహ్నం 2 గంటల నుంచి వరద గేట్లను మూసి వేసి దిగువ గోదావరికి నీటి విడుదలను నిలిపివేశారు.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

ఎల్ఎండీకి నాలుగు గేట్ల ద్వారా నీటి విడుదల

బోయినపల్లి ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి ద్వారా నీటి ప్రవాహం కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి శనివారం సాయం త్రం వరకు 18,000 క్యూసెక్కుల ఇన్ ఫ్లో కొనసాగుతోంది. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 14, 850, గాయత్రీ పంప్ హౌస్ ద్వారా 3,150 క్యూసెక్కుల నీరు వస్తోంది. మిడ్ మానేరు ప్రాజెక్టు సామర్థ్యం 27.741 టీఎంసీలకు 17.141 టీఎంసీల మేరకు నీరు ఉంది.

- **ఇల్లంతకుంట :** ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామ సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. మధ్యమానేరు ద్వారా 9,600 క్యూసెక్కుల నీరు వస్తుండగా ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 9,900క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.41 టీఎంసీల నీరు ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

10 టీఎంసీలకు చేరిన ఎల్ఎండీ నీరు

తిమ్మాపూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఎగువన శ్రీ రాజరాజేశ్వర జలాశయం (ఎంఎంఆర్) నుంచి కరీంనగర్ పరిధిలోని దిగువమానేరు జలాశయంలోకి నీటి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సోమవారం సాయంత్రం 6గంటల సమయంలో ఎల్ఎండీలోకి ఎగువ ఎంఎంఆర్ నుంచి 9,704క్యూసెక్కుల నీరు వస్తుండటంతో ఎల్ఎండీలో నీరు 9.905 టీఎంసీలకు చేరింది. ఎల్ఎండీ పూర్తి నీటి సామర్థ్యం 24.034 టీఎంసీలు. ఎల్ఎండీ నుంచి మిషన్ భగీరథ, ఆవిరి రూపంలో 236 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో వెలుతోంది. గత ఏడాది ఇదే రోజు ఎల్ఎండీలో 6.153 టీఎంసీల నీరు ఎల్ఎండీలో నిల్వ ఉంది. కాగా ఎంఎంఆర్, మోయతుమ్మెద వాగు నుంచి 9644క్యూసెక్కుల నీరు ఎల్ఎండీలోకి ఇన్‌ఫ్లోలు వస్తున్నాయి.

గాయత్రి పంపుహౌస్ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

ఎస్సారెస్పీతో కలిపి 20,650 క్యూసెక్కుల నీరు
మిడ్ మానేరుకు తరలింపు

రామడుగు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంపుహౌస్ నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ప్రస్తుతం ఒక్క పంపు ద్వారా 3150క్యూసెక్కుల నీటిని అధికారులు గ్రావిటీ కెనాల్‌కు విడుదల చేశారు. అది నేరుగా వెళ్లి వరద కాలువలో కలుస్తోంది. ఎస్సారెస్పీ నుంచి 18,500 క్యూసెక్కుల నీరు వరద కాలువలో 99వ కిలోమీటర్ల వద్ద కలుస్తున్నాయి. దీంతో ప్రస్తుతం 20,650 క్యూసెక్కుల నీరు చేరుతున్నది. అయితే మిడ్‌మానేరకు 20,650 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. వరదకాలువ నిండుకుండలా తయారై కొత్త ఒరవడిని సృష్టిస్తోంది.

రాజన్న ఆలయంలో రద్దీ

రాజన్నను దర్శించుకున్న జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి

వేములవాడ కల్చరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. రాజన్నకు ఎంతో ఇష్టమైన సోమవారం రోజున భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. కోడె మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో రాధాబాయి ఆధ్వర్యంలో ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి వారిని గ్రేటర్ హైదరాబాద్ నగర మున్సిపల్ మేయర్ విజయలక్ష్మి దర్శించుకున్నారు. సోమవారం ఉదయం రాజన్న ఆలయానికి వచ్చేసిన ఆమె రాజన్నకు కోడె మొక్కు చెల్లించుకున్నారు. వారి వెంట ప్రొటోకాల్ ఏఈవో గోవిందుల అశోక్ కుమార్, సూపరింటెండెంట్ వేదాంతం శ్రీకాంతచార్యులు, ఓడెపు వెంకటప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ బొడుసు మహేష్‌యాదవ్ ఉన్నారు.

కొండగట్టులో విజయలక్ష్మి పూజలు

మల్యాల: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ విజయలక్ష్మి సోమవారం కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. జీహెచ్ఎంసీ మేయర్‌కు అధికారులు, అర్చకులు స్వాగతం పలుకగా స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కోడె మొక్కు చెల్లించుకుంటున్న జీహెచ్ఎంసీ మేయర్



వేములవాడ ఆలయ ఆవరణలో భక్తులు


మట్టి గణపతే మహా గణపతి

పీవోపీతో పర్యావరణానికి హాని

ఇల్లందకుంట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి పంచభూతాలతో ఏర్పడినది. భూమి, ఆకాశం, గాలి, నీరు, నిప్పును దేవుళ్లుగా కొలవడం.. వేప, తులసి మొదలగు ప్రకృతిలోని లభించే వాటిని ఆరాధించడం హిందూ సంప్రదాయంలో ఉంది. కొద్ది కాలంగా సాంప్రదాయానికి విరుద్ధంగా పర్యావరణానికి హాని కలిగేలా ఉత్సవాలు జరుగుతున్నాయి. శబ్ద, వాయు, జల ఇతర రకాల కాలుష్యాలు చేస్తూ మనకు తెలియకుండానే ప్రకృతి వినాశ కారకులమవుతున్నాం. ఇది పట్టణాల్లో మొదలై పచ్చని పల్లెలకు వ్యాపించింది. గ్రామాలను కాలుష్య స్థావరాలుగా మారుస్తున్న తీరు మనకు కనిపిస్తున్నది. వినాయక విగ్రహాలను ఆకర్షణీయ రంగులతో పెద్దఎత్తున రూపొందిస్తూ వేడుకలు చేసుకుంటున్నారు. సాంప్రదాయం ప్రకారం వినాయకుడి ప్రతిమను మట్టితో తయారు చేసి భక్తి శ్రద్ధలతో పూజించేవారు. ఆ తర్వాత వినాయకుడి ప్రతిమను నీటిలో నిమజ్జనం చేసేవాళ్లు.

పీవోపీ గణపతులు..

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ గణపతి విగ్రహాలు కాకుండా మట్టి గణపతి విగ్రహాలు వాడాలని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వాడకం తగ్గించాలని సూచిస్తున్నారు. కొన్నేళ్లుగా ప్రజల తీరు మారింది. మట్టి గణపతిని వాడాలనే ఆకాంక్ష పెరిగింది. కృత్రిమ రసాయన పదార్థాలతో తయారు చేసిన గణపతి విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయడం మాత్రం ఇంకా జరుగుతూనే ఉంది. ఇది తీవ్రమైన జల కాలుష్యానికి దారి తీస్తున్నది.



పీవోపీ హానికారక రసాయనాలు
గాదె గుణసాగర్, ఇల్లందకుంట

ప్లాస్టర్ ఆఫ్ పారిస్(పీవోపీ)లో కాల్షియం, సల్ఫేట్, హేమి హైడ్రెట్ రసాయనాలుంటాయి. హాని కారక రంగుల వల్ల నిమజ్జనం చేసిన చెరువు, జలవనరులు కలుషితమవుతాయి.

మట్టి విగ్రహాలే మేలు
మండల జయమూర్తి, సిరిసేడు



మట్టితో తయారు చేసిన వినాయకుడి ప్రతిమ 45 నిమిషాల్లో నీటిలో కరిగిపోతుంది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు మాత్రం నీటిలో కరు గకుండా కొన్ని నెలల పాటు ఉండిపోతాయి. మట్టి వినాయకుడిని పూజించడం ద్వారా రీసైక్లింగ్ అనే ప్రకృతి విధానాన్ని మనం పాటించవచ్చు.



మానసిక వికలాంగుల పాఠశాలకు రూ.50 లక్షలు

ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి

తిమ్మాపూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న మానసిక వికలాంగుల పాఠశాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.50లక్షల నిధులను మంజూరు చేసిందని ట్రస్ట్‌చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని ఎల్ఎండీకాలనీలో గల మానసిక వికలాంగుల పాఠశాలలో ఆయన విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఇక్కడ 125మంది మానసిక వికలాంగులకు వారిని చూసుకోవడానికి మరో 35 మంది సిబ్బంది ఉన్నారన్నారు. ఈ ట్రస్ట్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులను మంజూరు చేస్తుండేవన్నారు. కానీ గత రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదన్నారు. కేంద్రానికి 2023- 2024వ సంవత్సరానికి రూ.80లక్షల నిధుల కోసం వినతులు పంపిస్తే రూ.35లక్షల నిధులు మంజూరు చేసిం దని, ఈ ఏడాది ఇంకా నిధులు విడుదల కాలేదన్నారు. సెప్టెం బరు 10న మానసిక వికలాంగుల పాఠశాలలో హైదరాబాద్ లోని ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి సహకారంతో పాఠశాలలోని వికలాంగుల పిల్లలతోపాటు ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పిల్లలకు కొత్త బస్సు ఇచ్చేందుకు దాతలు ముందుకు వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు జి కొమురెళ్ల రెడ్డి, జి భగవాన్, మదుసూదన్‌రావు, బి వెంకటయ్య, ప్రిన్సిపల్ సతీష్, ఏవో బాల్‌రాజ్, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు

హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 25 (ఆంధ్ర జ్యోతి): హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. పెద్దకల్వలలోని ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహాన్ని సోమ వారం తనిఖీ చేశారు. విద్యార్థులు, సిబ్బంది వివరాలను తెలుసుకొని వసతులను పరిశీ లించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజ నం అందించాలని, పరిసరాల శుభ్రత పాటిం చాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి స్వప్నరాణి ఉన్నారు.

బిల్లుల కోసం తంటాలు..

(5వ పేజీ తరువాయి)

పాఠశాలలు ఉండగా, 191 పాఠశాల ను ఎంపిక చేశారు. ఇందులో 101 ప్రాథమిక, 27 ప్రాథ మికోన్నత, 63 ఉన్నత పాఠశాలలను ఎంపిక చేశారు. వీటిని అభివృద్ధి చేసేందుకు రూ.55 కోట్లకు పైగా నిధులు మంజూరు చేశారు.

బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ..

పనులు చేసిన మాజీ ప్రతిప్రతినిధులు, ఎస్ఎంసీ బాధ్యులు బిల్లుల కోసం పంచాయతీరాజ్, రోడ్లు భవ నాల శాఖ, జిల్లా విద్యా శాఖ కార్యాలయం చుట్టూ ఏడాది కాలంగా తిరుగుతున్నారు. కొన్ని పాఠశాలల్లో మొత్తం పనులు పూర్తి కాగా, మరికొన్ని పాఠశాలల్లో అర్థంతరంగా వదిలి పెట్టారు. ఆ పనులను అమ్మ ఆదర్శ కమిటీలకు ప్రస్తుతం ప్రభుత్వం కేటాయించిన నిధులతో చేశారు. పనులు పూర్తి చేసిన వాళ్లు మాత్రం కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి వచ్చి పెండింగులో ఉన్న బిల్లులను ఇప్పించాలని కలెక్టర్‌ను వేడుకుంటున్నారు. జిల్లాలో 6 కోట్ల రూపాయల వరకు 'మన ఊరు మన బడి' కార్యక్రమం ద్వారా చేసిన పనులకు చెల్లించాల్సి ఉందని అధికార వర్గాల ద్వారా తెలుస్తున్నది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగు బిల్లులను విడుదల చేయాలని మాజీ ప్రతినిధులు, ఎస్ఎంసీ బాధ్యులు ప్రభుత్వాన్ని కోరారు.

రూ. 37 లక్షల బిల్లులు రావాలి

- బొడ్డు రాజమల్లు, మాజీ ఎంపీటీసీ, కుక్కలగూడూర్



కుక్కలగూడూర్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల అభివృద్ధికి 35 లక్షలు, బసంత్‌నగర్ పాఠశాలకు 23 లక్షల నిధులు మంజూర య్యాయి. పాఠశాలల్లో మరుగు దొడ్లు, కంపౌండ్ వాల్స్ నిర్మాణాలు, ఎలక్ట్రికల్ పనులు, డైనింగ్ హాల్, ఇతరత్రా పనులు చేశాను. కుక్కలగూడూర్ పాఠశాలల బిల్లు 14 లక్షలు, బసంత్‌నగర్‌లో 23 లక్షలు రావాలి. ఏడాదిగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా. అప్పులు చెల్లించలేక, వడ్డీల భారంతో ఇబ్బందులు పడుతున్నా. ప్రభుత్వం స్పందించి బిల్లులు చెల్లించాలి.

ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలి



దరఖాస్తులు పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.. ధర్మారం మండలం ఖిలావనపర్తి గ్రామానికి చెందిన ఎం.కవిత తనకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకోగా పిడి హౌసింగ్‌కు రాశారు. ముత్తారం మండలం పోతారం గ్రామానికి చెందిన గడ్డం పుష్పలత గ్రామ శివారు 59వ సర్వే నెంబర్ లో ఉన్న ప్రభుత్వ భూమి కబ్జాలో ఉందని, తనకు పట్టా ఇప్పించాలని దరఖాస్తు చేసుకోగా తహసీల్దార్‌కు రాశారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): కల్వచర్ల గ్రామ సమస్యలపై స్థానిక నాయకులు బొంకూరి పోచం, మెడగోని సదానందంలు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో రూ.2.60 కోట్లతో నిర్మాణం చేపట్టిన సిసి రోడ్డు పనుల్లో గృహాలు, గోడలు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలని, నెల రోజులుగా రక్షిత నీటి సౌకర్యం అందడం లేదని, బస్టాండ్ వద్ద ఉన్న శిలాఫలకాన్ని మరో ప్రాంతంలో ఏర్పాటు చేయాలని, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని వినతి పత్రం అందజేశారు.

కళ్యాణ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): ఫైవింక్లయిన్‌లోని ప్రాథమిక వైద్యశాలలో విఠల్‌నగర్, పరుశరాంనగర్, ఫైవింక్లయిన్ ఏరియాకు చెందిన కాలనీవాసులకు వైద్య పరీక్షల కోసం వెళితే అనుమతించడం లేదని కాంగ్రెస్ పార్టీ 33వ డివిజన్ అధ్యక్షుడు మారుపాక శంకర్ తెలిపారు. 7కిలో మీటర్ల దూరంలో ఉన్న లక్ష్మీపురం పీహెచ్‌సీ వెళ్లాలని వైద్యులు సూచిస్తున్నారని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. దీనిపై కలెక్టర్‌కు విన్నవించామన్నారు.

పంచాయతీ భవనం నిర్మించాలని సైకిల్‌పై కలెక్టరేట్‌కు...



పాలకుర్తి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): బసంత్‌నగర్ గ్రామ పంచాయతీకి ప్రభుత్వం భవనం నిర్మించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల కేంద్రానికి చెందిన తువ్వ సతీష్ యాదవ్ చలో కలెక్టరేట్ సైకిల్ యాత్ర చేపట్టాడు. సతీష్ మాట్లాడుతూ మూడేళ్ళ క్రితం పాడుబడిన పాత గ్రామ పంచాయతీ భవనాన్ని అప్పటి అధికారులు కూలగొట్టి నూతన భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చి ముగ్గు పోసి నేటివరకు పను లు ప్రారంభించలేద న్నారు. గతేడాది ఆగస్టు 17న భవనం నిర్మించాలని ఒక రోజు దీక్ష చేపట్టానని, అధికారులు శిబి రం వద్దకు వచ్చి భవనం నిర్మిస్తామని పేర్కొన్నారన్నారు. పంచాయతీ భవనం లేక ప్రజ లు పడుతున్న ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లేందుకు ఈ యాత్ర చేప ట్టి ప్రజావాణిలో వినతిపత్రం అందించానని తెలిపారు. వినతి పత్రం స్వీకరించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష సానుకూలంగా స్పందించారని, పంచాయతీకి భవనం నిర్మించే వరకు తన పోరాటం నిరసనలు కొనసాగిస్తానని తెలిపారు. పాత రవిందర్, గాజుల నరేందర్, కన్నం వెంకటేష్, ప్రసాద్, వేల్పుల సత్తమ్మ, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజల స్థితిగతులపై జాతీయ గణాంక శాఖ సర్వే

పాలకుర్తి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని జయ్యారంలో సోమవారం ప్రజాస్థితిగతులపై జాతీయ గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ బృందం సర్వే నిర్వహించింది. మొదట సాధారణ వివరాలతో సర్వే చేసిన అనంతరం ట్యాబ్ ద్వారా గ్రామంలో 12 కుటుంబాలను ఎంపిక చేస్తామని, మూడు నెలల పాటు నెలకు ఒకసారి పూర్తి వివరాలు నమోదు చేస్తామని అన్నారు.

కస్తూర్బాలో వైద్య శిబిరం



బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

సుల్తానాబాద్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): భూపతిపూర్ కస్తూర్బా బాలికల విద్యాలయంలో వైద్య శిబిరాన్ని స్పెషల్ ఆఫీసర్ ఎం.స్వప్న ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఆరు రోజులపాటు శిబిరం కొనసాగుతుందని తెలిపారు. బాలికల్లో రక్తహీనత, నెలసరి సమస్యలు, దంత, నేత్ర, చర్మ సమస్యలు గుర్తించి చికిత్స అందించనున్నట్లు చెప్పారు. ఆరోగ్య అలవాట్లు, వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పిస్తారన్నారు. డాక్టర్లు అనిత, మల్లేష్, ఏఎన్ఎం సఫియా బేగం, ఫార్మాసిస్టు మమత, సంధ్యారాణి పాల్గొన్నారు.

మహిళల భద్రత కోసమే షీటీం



మాట్లాడుతున్న షీ టీం మెంబర్ స్నేహలత

పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మహిళల భద్రత కోసమే షీటీం పని చేస్తుందని సభ్యురాలు స్నేహలత అన్నారు. సోమవారం రంగంపల్లిలోని శ్రీచైతన్య ఒకేషనల్ జూనియర్ కళాశాలలో మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలు, యాంటీ డ్రగ్స్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అంశాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా వేధింపులకు పాల్పడితే 6303923700 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సభ్యులు మౌనిక, సురేష్, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

సుల్తానాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వినాయక విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లను సోమవారం మున్సిపల్ కమిషనర్ రమేష్ పరిశీలించారు. పెద్ద చెరువు కట్ట వద్ద నిమజ్జనానికి అడ్డుగా ఉన్న చెట్లను తొలగించే పనులను పర్యవేక్షించారు. సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.

నిరుపేదలకు అండగా ఉంటున్నాం

సుల్తానాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పదేళ్లుగా నిరుపేద కుటుం బాలకు అండగా ఉంటున్నామని తాళ్లపల్లి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మనోజ్ గౌడ్ అన్నారు. ఐతరాజుపల్లి గ్రామానికి చెందిన న్యాతరి పద్మ అంజయ్యకు సోమవారం మనోజ్ గౌడ్ ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్ అందజేశారు. కల్వల మధుకర్, రాయిల్ల రాజు, ఈర్ల కార్తీక్, ఆకుల అనిల్, అవినాష్, అమరేందర్ ఉన్నారు.

ఉపకార వేతనాలు విడుదల చేయాలి

పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉపకార వేతనాలు విద్యార్థుల హక్కు అన్నారు. గత ప్రభుత్వ మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విద్యార్థులపై కపట ప్రేమ కనబరుస్తోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అజయ్, అరవింద్, అభి, నగేష్, సోను, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మదర్‌థెరిస్సాలో రక్తదాన శిబిరం

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పెద్దబొంకూర్‌లోని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 25 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. రక్తదానం చేయడం ద్వారా మరొకరికి ప్రాణం ఇచ్చిన వారమవుతామన్నారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కావేటి రాజగోపాల్, వైబ్రెంట్ సొసైటీ శ్రీకాంత్, బ్రహ్మకుమారి పెద్దపల్లి ఇన్‌చార్జి మనీషా పాల్గొన్నారు.

నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగు

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) నేత్రదానంతో అంధులకు వెలుగులు నింపవచ్చని జిల్లా జడ్జి సునీత కుంచాల పేర్కొన్నారు. నేత్రదాన పక్షోత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా, సోమవారం జిల్లా కేంద్రంలోని కోర్టు ప్రాంగణంలో సదాశయ ఫౌండేషన్ ప్రతినిధి పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో నేత్రదాన పక్షోత్సవాల కరపత్రాలు ఆవిష్కరించారు. జిల్లాలో నేత్రదానంపై అవగాహన పెరుగుతోందని, నేత్రదానంతో చూపు సజీవంగా ఉంటుందని, మరో ఇద్దరు అంధులకు వెలుగులు ప్రసాదించవచ్చన్నారు. సదాశయ ఫౌండేషన్ ద్వారా ఇప్పటి వరకు నేత్ర, అవయవ దానాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించడంపై అభినందించారు. స్వరూపరాణి, రవీందర్, రమేష్ కోటేశ్వర రావు, శ్యాంప్రసాద్, అశోక్, మేన మహేందర్, బొడ్డుపెళ్ళి లక్ష్మణ్ పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మైన్స్ ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి మాట్లాడారు. శిక్షణ పొందుతున్న 20 మంది ఉద్యోగులు మరణానంతరం నేత్రదానం చేయడానికి అంగీకారం తెలపగా వారికి డోనర్స్ కార్డులను అందజేశారు. ఓవర్‌మెన్లు కిషోర్, తిరుపతి పాల్గొన్నారు.

జేఎన్టీయూలో గణపతి నవరాత్రి వేడుకలు

రామగిరి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జెఎన్టీయూ కళాశాలలో సోమవారం రెండు రోజుల ముందుస్తుగా గణపతి నవరాత్రి వేడుకలను ప్రారంభించారు. కళాశాల ప్రాంగణంలో భద్రకాళి ఆలయ ప్రధాన అర్చకుడు సముద్రాల విజయసారథి వేదమంత్రోచ్చారణ మధ్య గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఏకదంత వినాయక ఫైలాన్‌ను ఆవిష్కరించారు. వైస్ ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్ పింగిళి కృష్ణారెడ్డి, పరిపాలనాధికారి సుమన్‌రెడ్డి, పిఏ కమలహసన్, కనిష్క, శ్రీకాంత్, క్రాంతి, అరవింద్, కిషోర్, చరణ్‌తో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన పీఏసీఎస్ చైర్మన్



ఎలిగేడు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ గ్రామానికి చెందిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు గోప విజయభాస్కర్ రెడ్డి సోమవారం సుల్తానాబాద్‌లో ఎమ్మెల్యే విజయరమణరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు కండువా కప్పి స్వాగతం పలికారు.

ఆశా వర్కర్లకు రూ.18వేలు చెల్లించాలి

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పెంచిన వేతనాలు ఆశ వర్కర్లకు అమలు చేయాలని సోమవారం కలెక్టరెట్ ఎదుట ఆశా వర్కర్లు ధర్నా చేపట్టారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు జి జ్యోతి మాట్లాడుతూ రూ.18వేల వేతనం చెల్లించాల్సిన ప్రభుత్వం పారితోషకాలు తగ్గించాలనే విధానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉదయం నుండి సాయంత్రం వరకు అనేక రకాలు సర్వేలు చేస్తున్నారని, గర్భిణీ బాలింతల ఆరోగ్యం, గర్భిణీలు డెలివరీ అయ్యేదాకా కాపాడుతున్నామన్నారు. సెలవులు కూడా ఆశ వర్కర్లకు లేవని ఉద్యోగ భద్రత లేదన్నారు. ధర్నా అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఎస్ వెంకట స్వామి, తాండ్ర శారద, డి రజిత, ఎస్ జ్యోతి కే.రూపారాణి, ఈ శివలీల ,కే సరోజన, విజయ, ఆర్ రేణుక ,మంజుల ,లత ,లక్ష్మి, సునీత ,సువర్ణ ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఖని ఆసుపత్రిని సందర్శించిన సీపీఎం బృందం



ఆసుపత్రిలో సీపీఎం నాయకుల బృందం

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రోగులు క్యూ కడుతున్నారని, ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి యాకయ్య డిమాండ్ చేశారు. సోమవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సీపీఎం బృందం పర్యటించింది. సీజనల్ వ్యాధులతో రోగులకు బెడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఒకే బెడ్‌పై ముగ్గురికి చికిత్సను అందిస్తున్నారని, దీంతో ఒకరి నుంచి ఒకరికి వ్యాధులు సక్రమించే ప్రమాదం ఉందన్నారు. ఆసుపత్రిలో కార్డియాలజిస్ట్, యూరాలజీ, నెఫ్రాలజీ డాక్టర్లు లేరని, 120మంది వైద్యులు ఉండాల్సి ఉండగా 80మంది ఉన్నారని, ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎంఆర్ఐ స్కానింగ్‌ను ఏర్పాటు చేయాలని, భవనాన్ని త్వరితగతిన పూర్తి చేసి రోగులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

బీపీ మండల్ జయంతి

మంథని, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): బీపీ మండల్ జయంతిని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నేతలు సోమవారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పార్టీ అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్, నేతలు గొబ్బూరి వంశీ, కనవేన శ్రీనివాస్, వేల్పుల గట్టయ్యలు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): ఈవీఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కాలనీలో బీపీ మండల్ జయంతి జరిగింది. సంస్థ చైర్మన్ మహేష్ మండల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



సుల్తానాబాద్‌లో క్రీడల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న డీవైఎస్‌ఓ వై సురేష్

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 25 (ఆంధ్ర జ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా విద్యాధికారి మాధవి అన్నారు. సోమవారం అప్పన్నపేట జిల్లా పరిషత్ పాఠశాలలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు నిర్వహించారు. డీఈవో హాజరై క్రీడలను ప్రారంభించారు. మండల విద్యాధికారి సురేంద్రకుమార్, అప్పన్నపేట సింగిల్ విండో చైర్మన్ సంపత్, ఉపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడలలో రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తుతో పాటు ఆరోగ్యం చేకూరుతుందని జిల్లా యువజన క్రీడల అభివృద్ధి శాఖ అధికారి వై సురేష్ అన్నారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలను ఐపీఎస్ పాఠశాలలో ఎంఈవో ఆరేపల్లి రాజయ్యతో కలిసి డీఎస్‌డీవో ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో క్రీడా పోటీలు జరుగుతున్నాయన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడలలో పాల్గొనేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శిక్షణ ఇస్తున్నాయని, సీఎం క్రీడలకు ప్రాధాన్యం ఇస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారన్నారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, ట్రస్మా జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బు బుచ్చిరెడ్డి, ఇండియన్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ సంజీవ్ కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు, కార్యదర్శి రవీందర్, అమిరిశెట్టి తిరుపతి, ప్రణయ్ పాల్గొన్నారు.

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): ఆటల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని ఇన్‌చార్జి తహసీల్దార్ ఉదయ్ కుమార్ అన్నా రు. ఎంఈఓ ప్రభాకర్‌తో కలిసి మేడారం బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి పోటీలను ప్రారంభించారు. క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక వికాసం కలుగుతుందని పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా సుమారు 250 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ప్రిన్సిపాల్ విద్యాసాగర్ రావు, ప్రధానోపాధ్యాయులు వసంత, శ్రీనివాసరావు, వేణుగోపాల్‌రావు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల కార్యదర్శి సౌజన్య, పీఈటీలు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోండి



భవనం ఎదుట నిరసన తెలుపుతున్న ఏఐవైఎఫ్ నాయకులు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నర్సరీ స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న భవన నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మార్కపురి సూర్య డిమాండ్ చేశారు. ఆసుపత్రిలోని నర్సరీ స్థలాన్ని ఆక్రమించుకుని అక్రమ కట్టడాన్ని నిర్మిస్తున్నా ఆసుపత్రి సూపరింటెంటెంట్, టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. అనుమతులు లేని భవనాలను కూల్చివేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ భవనాన్ని ఎందుకు వదిలేస్తున్నారని ప్రశ్నించారు. ఓ మాజీ ప్రజా ప్రతినిధి భవనాన్ని నిర్మిస్తున్నా కమిషనర్ నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. సురేందర్, ఆసాల నవీన్ పాల్గొన్నారు.

'సురవరం' మరణం తీరని లోటు



చిత్రపటానికి పూలమాల వేస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

గోదావరిఖని, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): సీపీఐ అగ్రనేత, మాజీ పార్లమెంటు సభ్యులు సురవరం సుధాకర్‌రెడ్డి మరణం కమ్యూనిస్ట్ ఉద్యమానికి తీరని లోటని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు గోసిక మోహన్, గౌతం గోవర్దన్, ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్‌లు పేర్కొన్నారు. సోమవారం భాస్కర్‌రావు భవన్‌లో సుధాకర్ రెడ్డి సంతాప సభలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెండుసార్లు ఎంపీగా గెలు పొంది, కార్మిక, రైతు, విద్యార్థి, యువజన మహిళా హక్కుల సాధన కోసం చట్ట సభల్లో నిలదీశారని పేర్కొన్నారు. కనకరాజు, మల్లయ్య, ఓదేమ్మ, సూర్య, పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు

పాలకుర్తి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియా కొరత లేదని మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్‌కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. రైతులు పత్తి, వరికి మూడు నుంచి నాలుగుసార్లు యూరియా వేస్తారన్నారు. రైతులు యూరియా నిల్వ చేస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

వర్తక సంఘం సమావేశం

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణ వెండి, బంగారు వర్తక సంఘం సమావేశం జరిగింది. సంఘం కార్యాలయంలో అధ్యక్షుడిగా ఎన్నికైన రంగు శ్రీనివాస్ ను సోమవారం సభ్యులు సత్కరించారు. సంఘం ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు సభ్యులు సహకరించాలని కోరారు. కార్యదర్శి రాజు, విజయగిరి శ్రీనివాస్, వెంకటేష్, పూర్ణాచారి, సంజీవ, పాల్గొన్నారు.



కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని దశల వారి ఆందోళనలు చేపట్టనున్నట్టు టీబీజీకేఎస్ ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం కాలనీలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2023-24 సంవత్సర లాభాల్లో 33శాతం వాటా కార్మికులకు చెల్లిస్తామని ప్రచారం చేశాయని, వాస్తవానికి 16 శాతం మాత్రమే చెల్లించినట్టు తెలిపారు. మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న కార్మికులందరిని ఇన్వాలిడేషన్ చేస్తామని చెప్పిన గెలిచిన సంఘాలు ఇటీవల జరిగిన మెడికల్ బోర్డు ఫలితాలపై కార్మికులకు ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన బకాయిలు చెల్లించాలని, మారుపేర్ల సమస్యను పరిష్కరించాలని, కొత్త ట్రాన్స్‌ఫర్ పాలసీని రద్దు చేయాలన్నారు. నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సురేందర్ పాల్గొన్నారు.

ఆర్జీ-2లో నాలెడ్జ్ డే సమావేశం

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 జీఎం ఆఫీస్‌లో సోమవారం సింగరేణి బొగ్గు రవాణా, మార్కెటింగ్ సవాళ్ళపై జీఎం కోఆర్డినేషన్ ఎస్డీఎం సుభాని నాలెడ్జ్‌డే సమావేశంలో పాల్గొన్నారు. బొగ్గు ఉత్పత్తి, సరఫరా సవాళ్ళతో కూడుకున్న అంశమని పేర్కొన్నారు. రైలు రేకుల లభ్యత, రవాణా సౌకర్యాలు, మార్కెట్‌లో పోటీ, వినియోగదారుల అవసరాల మార్పు అంశాలు ప్రధాన సవాళ్ళుగా ఉన్నాయని తెలిపారు. మార్కెటింగ్‌లో పారదర్శకత, సమయపాలన, నాణ్యతపై దృష్టి సారించినట్టు జీఎం పేర్కొన్నారు. ఆర్జీ-2 జీఎం వెంకటయ్య, ఎస్వోటూ జీఎం రాములు, అధికారులు సృజన్‌మెహ్రా, నెహ్రూ, ఉదయ్‌హరిజన్, సంతోష్‌కుమార్, అరవిందరావు, రాజాజీ, ధనుంజయ, మురళీకృష్ణ పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును విజయవంతం చేయండి

రామగిరి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో సెప్టెంబర్ 7న నిర్వహించే ఐఎఫ్‌టీయు రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న పిలుపు నిచ్చారు. సోమవారం ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసిపి-2లో కాంట్రాక్టు కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి నిర్వహించే సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఓదెలు, సది, శ్రీనివాస్, సంపత్, అజయ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మట్టి వినాయకులను పూజిద్దాం



మట్టి వినాయకులను అందజేస్తున్న డైరెక్టర్(పా) గౌతమ్ పొట్రు

గోదావరిఖని, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులు, అధికారులు మట్టి వినాయక ప్రతిమలతో పూజా కార్యక్రమాలు నిర్వహించాలని, పర్యావరణకు దోహదపడాలని సింగరేణి డైరెక్టర్ పర్సనల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వెల్ఫేర్ గౌతమ్ పొట్రు పిలుపునిచ్చారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో సోమవారం ఆయన మట్టి వినాయక ప్రతిమలను ఉద్యోగులకు, అధికారులకు పంపిణీ చేశారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారుచేసిన వినాయక ప్రతిమలు నిమజ్జనం అనంతరం చెరువుల్లో, జలాశయాలలో జల కాలుష్యానికి కారణం అవుతున్నాయన్నారు. జీఎం మార్కెటింగ్ టీ శ్రీనివాస్, సింగరేణి భవన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ సమస్యలపై సమీక్ష

గోదావరిఖని, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జీరో పెండేన్సి, సీఎంపీఎఫ్, పెన్షన్ సెటిల్‌మెంట్‌కు సంబంధించి సోమవారం ఆర్‌జీ-1 జీఎం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సీఎంపీఎఫ్ అడిషనల్ కమిషనర్ గోవర్ధన్ ముఖ్య అతిథిగా హాజరై ఎన్‌సీడబ్ల్యుఏ ఉద్యోగుల సీఎంపీఎఫ్, పెన్షన్ సెటిల్‌మెంట్ కు సంబంధించి వివరించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్ రెడ్డి, ఏరియా సెక్యూరిటి అధికారి వీరారెడ్డి, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ వేణు, సీనియర్ పర్సనల్ అధికారులు శ్రావణ్ కుమార్, హనుమంతరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ దేవాచారి పాల్గొన్నారు.

బదిలీపై వెళుతున్న ఎస్‌అండ్‌పీసీ సిబ్బందికి సన్మానం

గోదావరిఖని, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 ఏరియా ఎస్‌అండ్‌పీసీలో సెక్యూరిటీ గార్డులుగా విధులు నిర్వహించి బదిలీపై వెళుతున్న బోజ్యా నాయక్, చంద్రగౌడ్‌లను సోమవారం అధికారులు, తోటి సెక్యూరిటీ గార్డులు ఆర్‌జీ-1 ఏరియా సెక్యూరిటీ కార్యాలయంలో సన్మానించారు. సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, సిబ్బంది శ్రీనివాస్, రాజన్న, తిరుపతి, సదానందం పాల్గొన్నారు.

ముగిసిన రెస్క్యూ శిక్షణా తరగతులు

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఇనీషియల్ రెస్క్యూలో రెండు వారాల పాటు జరిగిన శిక్షణా తరగతులు సోమవారంతో ముగిశాయి. రెస్క్యూ స్టేషన్‌లో జరిగిన ముగింపు కార్యక్రమానికి సింగరేణి జీఎం(కోఆర్డినేషన్) సుభాని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రెస్క్యూలో నైపుణ్యం సాధించాలని, శిక్షణ పొందిన వారికి విధుల్లో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికేట్లను అందజేశారు. ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య, రెస్క్యూ జీఎం శ్రీనివాసరెడ్డి, సూపరెండెంట్ రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏఐటీయూసీలో చేరిన సింగరేణి ఏరియా హాస్పిటల్ సిబ్బంది

గోదావరిఖని, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఏరియా హాస్పిటల్ సిబ్బంది ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య అధ్యక్షతన సోమవారం ఏఐటీయూసీలో చేరారు. సింగరేణి హాస్పిటల్‌లలో పని చేస్తున్న కార్మికులు, పారా మెడికల్ సిబ్బందికి పదోన్నతులు రాక ఆర్థికంగా నష్టపోతున్నారని ఆయన అన్నారు. దీనిపై గుర్తింపు సంఘం ఏఐటీయూసీ యాజమాన్యంతో ఇటీవల జరిగిన స్ట్రక్చర్ సమావేశంలో సమస్యలను పరిష్కరించాలని కోరామన్నారు. ఏఐటీయూసీలో చేరిన మెడికల్ సిబ్బంది సీనియర్ స్టాఫ్ నర్స్, విజయలక్ష్మి, శ్రీకాంత్, గోపి క్రిష్ణ, రమేశ్, శశికాంత్, కిరణ్, సరిత, స్వరూప రాణిలకు వాసిరెడ్డి సీతారామయ్య కండువాలు కప్పి యూనియన్ లోకి ఆహ్వానించారు. సంతోష్ మడ్డి ఎల్లాగౌడ్, ఆరెల్లి పోషం, కనకరాజు, దాసరి అనిల్, భాస్కర్, సత్యనారాయణ, పాల్గొన్నారు.